



# కరపత్రం

SINCE 2014

గురువారం ఏప్రిల్ 9, 2026 | సంపుటి : 2 | సంచిక : 178 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




# చేనేతలో టెండర్ల విధానం రద్దు చేయండి

- సిఎం రేవంత్‌తో ఘనా హైకమిషనర్ భేటీ
- సిఎంతో భేటీ అయిన టాటా ఏరో స్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్

హైదరాబాద్,ఏప్రిల్8:
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘనా హైకమిషనర్ క్వాసి ఒబిరి-డాన్సో మర్యాదపూర్వకంగా కలిసిన రిపబ్లిక్ ఆఫ్ ఘనా హైకమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా హైదరాబాద్ కు వచ్చిన క్వాసి ఒబిరి-డాన్ సిఎంను ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఘనా, తెలంగాణ మధ్య సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించిన హైకమిషనర్. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలు, ఆరోగ్య, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం ఉండాలని కోరిన హైకమిషనర్. ా నుకూలంగా స్పందించిన సీఎం రేవంత ఆయనకు శాలువాతో సన్మానించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టాటా ఏరో స్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారతదేశంలో ఎఫ్-130ఏ సూపర్ హెర్క్యులస్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేయనున్న లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ. అంతర్జాతీయ అవసరాల కోసం భారతదేశంలోని టిఎఎస్ఎల్ లో ఈ-16 వింగ్స్ ను ఉత్పత్తి చేసేందుకు లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది. తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్లు ఈ సందర్భంగా టిమ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



# ఖర్చుగా కాదు... భాగస్వామ్యంగా చూడండి....

- ప్రాధాన్య రంగాలను మీరే ఎంచుకోండి...
- అవసరమైన సహకారం మేం అందిస్తాం...
- సిఎస్ఆర్ నిధులపై పెనీల ప్రతినిధులతో .రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్8 :
సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీలు సీఎస్ఆర్‌కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని తెలియజేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకొని సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని సూచించారు. ప్రభుత్వంతో పాటు కంపెనీలు కలిపి చేసే వ్యయంతో తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యం ఉన్న వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను వారు అందిపుచ్చుకునేలా తయారు చేయగలమని సీఎం అన్నారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ నగరంలోనే 44 శాతం ఉన్నారని.. వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించు కుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం లేనందున తాము ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఇందుకు నియమించామని సీఎం తెలిపారు.

మిగతాద్ది 2 లో



# కాలుష్య కాసారంగా బంజారా లేక్

- ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలసి పరిశీలన
- చెరువు రక్షణకు చర్యలు తీసుకుంటామన్న రంగనాథ్

హైదరాబాద్,ఏప్రిల్8 :
బంజారాహిల్స్‌లో ఉన్న బంజారా లేక్ ను హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

2 లో



# నాదర్‌గుల్ భూముల్లో వాటా రానందుకే హరీశ్‌రావు దుష్ప్రచారం: మంత్రి పొంగులేటి

హైదరాబాద్:
నాదర్‌గుల్ భూముల విషయంలో భారత రాష్ట్ర సమితి నేత హరీశ్ రావు దుష్ప్రచారం చేస్తున్నారని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.

# ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణయే ఎటిఎం

- ఢిల్లీకి గులంగిరీ చేస్తోన్న రేవంత్ ప్రభుత్వం
- కొత్త పార్టీతో సామాన్యలకు అండగా నిలుస్తాం
- కాంగ్రెస్ అవినీతిపై ఇక నిరంతరంగా నిలదీస్తాం
- ఏప్రిల్ 25 చరిత్రను మార్చే రోజు అవుతుంది
- జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,ఏప్రిల్8 :
దేశంలో ఎక్కడ ఎన్నికలు వచ్చినా సరే కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు.




మిగతాది 2లో

# గిరిజన ప్రాంత సమస్యలపై మానవతా దృక్పథంతో పనిచేయండి

- మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు పెద్దపీట వేయాలి
- గిరిజన జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ప్రభుత్వం సంకల్పం
- ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా చిత్తశుద్ధితో పనిచేయండి
- అధికారులకు దిశ నిర్దేశం చేసిన మంత్రి అడ్లురి లక్ష్మణ్ కుమార్



2లో..

హైదరాబాద్,ఏప్రిల్8 :
గిరిజన ప్రాంత సమస్యల పరిష్కారంలో అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలని, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. గిరిజన జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమని, ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం పేద గిరిజనులు నివసించే ప్రతి ప్రాంతానికి చేరుకునే త్రోవ, నివసించేందుకు గూడు , అడవుల్లో చీకట్లు తొలగించే విద్యుత్ సౌకర్యం, తాగునీటి కోసం బోర్లు వంటి ప్రాథమిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు.



# టిడిపి సమావేశాల నిర్వహణలో నిర్లక్ష్యం

- పార్టీ నేతల తీరుపై లోకేశ్ అసహనం
- పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు సన్మానం
- మంగళగిరి టిడిపి కార్యాలయంలో లోకేశ్

అమరావతి,ఏప్రిల్8 :
కొందరు పార్టీ నేతల తీరుపై మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్ర అసమనం వ్యక్తం చేశారు. ఇలా అయితే ఎలా అంటూ ఆగ్రహం కూడా వ్యక్తపరచారు. కేడర్ సమావేశాలు, గ్రీవెన్స్ వరుసగా నాలుగు వారాలు నిర్వహించని పలువురు నాయకులను నారా లోకేశ్ మందలించారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి వరుసగా నాలుగు వారాలు కేడర్ సమావేశాలు, గ్రీవెన్స్ నిర్వహించకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాలు నిర్వహించకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకోవాలని పార్టీ కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

2లో..



# కోర్టు తీర్పు వచ్చే వరకు ఆగలేరా

- అప్పుడే వెళ్లి రైతులను వేధించాలా
- హైడ్రా తీరుపై మండిపడ్డ మందకృష్ణ మాదిగ

సంగారెడ్డి,ఏప్రిల్8 :
ఐలాపూర్‌లోని సర్వే నంబర్ -1 నుంచి 220 వరకు గల 1265 ఎకరాల భూమి భూ వివాదంలో పేద రైతులను హైడ్రా ఇబ్బంది పెట్టడం సరికాదని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివాదాస్పద భూములతో సంబంధం లేని రైతులను భయభ్రాంతులకు గురిచేయటం దారుణమని మంద కృష్ణ మాదిగ చెప్పారు. కోర్టు పరిధిలో ఉన్న కేసుల్లో తీర్పు వచ్చేంతవరకు హైడ్రా అధికారులు సంయమనం పాటించాలని సూచించారు. ఈ మేరకు హైడ్రాపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ షాకింగ్ కామెంట్స్ చేశారు. బుధవారం అమీన్ పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలోని వివాదంలో ఉన్న భూముల రైతులను

2లో..



## కాళేశ్వరం మోటర్లను ?

# దెబ్బతీసే కుట్రలు

- సరైన మెయింటెనెన్స్ లేకుండా చేస్తే ఎలా?
- మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ

హైదరాబాద్,ఏప్రిల్8 :
కాళేశ్వరానికి సంబంధించి భారీ నీటిపారుదల మోటార్లను ధ్వంసం చేసే కుట్ర సాగుతోందంటూ కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ధ్వజమెత్తారు. భారీ నీటిపారుదల మోటార్లను ఇష్టానుసారంగా ఆన్, ఆఫ్ చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.ప్రాజెక్టుల్లోని భారీ మోటార్లను నిబంధనలకు విరుద్ధంగా పదే పదే ఆన్, ఆఫ్ చేస్తూ అశాస్త్రీయంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలా చేస్తే వైబ్రేషన్స్ వచ్చి పంపులు, ఇంపెల్లర్స్, మోటార్స్ పాడయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

మిగతాద్ది 2 లో

# జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ

- విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం
- తీర్పును 22కు వాయిదా వేసిన హైకోర్టు



2లో..

హైదరాబాద్,ఏప్రిల్8
కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పును ఈ నెల 22కు వాయిదా వేసింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం ఏప్రిల్ 9, 2026

# గిరిజన ప్రాంత సమస్యలపై మానవతా దృక్పథంతో పనిచేయండి

మొదటిపేజీ తరువాయి
ఈ మౌలిక సదుపాయాలే గిరిజనుల జీవన ప్రమాణాల పెరుగుదలకు పునాది అని పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలో గిరిజన ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి వివిధ జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలు, అటవీ శాఖ అధికారులు, గిరిజన ప్రాంతాల ప్రజాప్రతినిధులతో విస్తృతంగా చర్చించారు. గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం మౌలిక వసతుల కోసం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ, అమలు దశలో ఎదురవుతున్న అడ్డంకులపై మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగు పర్చాలంటే శాఖల మధ్య సమన్వయం అత్యవసరమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిరిజనుల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో, కేటాయించిన నిధులు లక్ష్యానికి చేరేలా అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. నిధులు ఉన్నా పనులు జరగకపోవడం సహించబోమని హెచ్చరించారు. అటవీ భూములు, పోడు సాగు, ఫారెస్ట్ రైట్స్ చట్టం కింద హక్కుల పత్రాల జారీ విషయంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్నారు. అటవీ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేసి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలని సూచించారు. అవసరమైతే ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి వేగంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అటవిని నమ్ముకొని జీవిస్తున్న గిరిజనలు వారికి కేవలం వ్యవసాయం ఒక్కటే ఆధారం కాబట్టి అటవీ చట్టం అనుసరించి వారికి ఎక్కడ వీలు అయితే అక్కడ వారికి వ్యవసాయం చేసుకునేలా సాగు భూమిని అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి అటవీశాఖ అధికారులను ఆదేశించారు. గిరిజన యువతను ప్రభావితం చేస్తున్న కుల ధ్రువీకరణ సమస్యలపై మంత్రి ప్రత్యేక చొరవ చూపారు. హైకోర్టు అడ్వకేట్ జనరల్‌తో సంప్రదించి ఎస్టీ సర్టిఫికెట్ వ్యవహారంలో శాశ్వత పరిష్కారం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ధ్రువీకరణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా సరళమైన విధానాన్ని అమలు చేయాలని సూచించారు. జిల్లాస్థాయిలో కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులు, అటవీ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక సమీక్షలు నిర్వహించి సమస్యలను స్థానికంగానే పరిష్కరించే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఇసుక రవాణా సమస్యలు గిరిజనులకు అడ్డంకి కాకూడదని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైన చోట ప్రత్యేక అనుమతులు ఇచ్చి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అలాగే తాగునీటి సమస్య నివారణకు కొత్త బోర్లు త్రవ్వడం, పాత వనరులను పునరుద్ధరించడం చేపట్టాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలని మంత్రి నిర్ణయించారు. గిరిజన గ్రామాలను స్వయంగా సందర్శించి వాస్తవ పరిస్థితులను తెలుసుకుంటానని తెలిపారు. నెలాఖరులోగా గిరిజన ప్రాంతాల్లో ముఖ్య సమస్యల పరిష్కారం దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు ప్రారంభించాలని మంత్రి గడువు విధించారు. ఒక ప్రాంత సమస్యను రాష్ట్రవ్యాప్తంగా వర్తింపజేయకుండా, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ గిరిజన సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించినందుకు మంత్రిని ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్యసాచి ఘోష్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణ , ఎమ్మెల్యేలు బాలు నాయక్, రామచంద్ర నాయక్, డా. చిక్కుడు వంశీకృష్ణ, మురళి నాయక్, కోవ లక్ష్మి, అనిల్ కుమార్ యాదవ్ తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులు, డిఎఫ్ఓలు ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## టిడిపి సమావేశాల నిర్వహణలో నిర్లక్ష్యం

మొదటిపేజీ తరువాయి
నారా లోకేశ్ బుధవారం టీడీపీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆ పార్టీ నేతలపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు వారాల నుంచి కేడర్ సమావేశాలు నిర్వహించని పులివెందుల ఇన్‌చార్జ్ బీటెక్ రవి, కమలాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డి, నాలుగు వారాల నుంచి గ్రీవెన్స్ నిర్వహించని ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పట్ల నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు కచ్చితంగా నిర్వహించాలని లోకేశ్ హుకుం జారీ చేశారు. ఇకముందు ఇలానే వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని లోకేశ్ స్పష్టం చేశారు. కష్టపడిన వారిని గుర్తించాలనేది తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. నేతల పనితీరే ఇక్కడి వరకు రావడానికి కారణమని చెప్పారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే పార్టీ వందేళ్లు ఉంటుందని తెలిపారు. 'మై టీడీపీ యాప్' టాప్ 10 ఫెర్ఫార్మర్స్‌తో మంత్రి లోకేశ్ ఆత్మీయ భేటీ అయ్యారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశర చేశారు. యాప్ సమర్ధ వినియోగం పట్ల ఉత్తమ కార్యకర్తలను లోకేశ్ ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించడమే తమ సిద్ధాంతమని లోకేశ్ అన్నారు. పార్టీకి అండగా నిలిచిన వారిని ఎప్పటికీ విస్మరించేది లేదన్నారు. 'మై టీడీపీ యాప్' టాప్-10 ఫెర్మార్మర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'మై టీడీపీ యాప్' సమర్థ వినియోగం, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడంపై మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. మీ పని తీరే ఇక్కడి వరకు రావడానికి కారణమంటూ కొనియాడారు. ఉత్తమ కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం మరింతగా కష్టపడాలని, టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి లోకేశ్ భరోసా కల్పించారు.

## ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణయే ఎటిఎం

మొదటిపేజీ తరువాయి
సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఢిల్లీకి ఘోరమైన గులాంగిరి చేస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేస్తే ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా రేవంత్‌రెడ్డి నిలబడే మాట్లాడుతున్నారని.. లేదంటే తన కుర్చీకి ఎక్కడ ఎసరు వస్తుందోనని భయపడుతున్నారని సెటైర్లు గుప్పించారు. బుధవారం తెలంగాణ జాగృతిలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు చేరారు. కండువా కప్పి జాగృతిలోకి కవిత ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రాసి పెట్టుకోండి.. తెలంగాణ భవిష్యత్, చరిత్రను మార్చే రోజు ఏప్రిల్ 25 అవుతోందని కవిత ఉద్ఘాటించారు. కొత్త నెత్తురు, కొత్త రాజకీయాలను ఈ గడ్డకు పరిచయం చేస్తానని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తాం, పోరాడుతాం, పరిష్కరిస్తామని చెప్పుకొచ్చారు. పప్పన్నం తింటాం, ప్రజల మధ్యలో ఉంటామని.. వారితోనే కలిసి పనిచేస్తామని మాటిచ్చారు. సామాన్యులతో, సామాన్యుల కోసం, సామాన్యులే ఉండేలా రాజకీయం తెస్తామని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అధికార పక్షం కాంగ్రెస్, ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యల గురించి ప్రశ్నించేదెవరు అంటే ప్రతినోట జాగృతియే అనే మాట వస్తోందని చెప్పారు. ప్రజల సమస్యల గురించి కాంగ్రెస్ హై కమాండ్‌ని పైసలు అడిగితే నో రాహుల్ జీ అని రేవంత్‌రెడ్డికి సమాధానం చెబుతున్నారని అన్నారు. కానీ కేరళ ఎన్నికల కోసం ఎంత ఖర్చయినా పెడుతున్నారని విమర్శించారు. అప్పర్ తుంగభద్రకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇస్తే రేవంత్‌రెడ్డి ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు. జాతీయ హోదా కారణంగా తుంగభద్రకు నీళ్లు రాక నష్టపోయేది ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాయేనని.. కానీ ఈ విషయంలో రేవంత్‌రెడ్డి ఎందుకు మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని నిలదీశారు. అటు కాంగ్రెస్‌ను, ఇటు బీజేపీని మెయింటెయిన్ చేస్తూ ప్రజలను మాత్రం మోసం చేస్తున్నారని ఆగ్రహించారు. తెలంగాణ జాగృతి తరఫున వచ్చే పార్టీ.. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తుందని భరోసా కల్పించారు. అంతర్జాతీయ స్థాయిలో నిపుణులతో సమావేశమై ప్రజల కోసం అద్భుతమైన అజెండా రూపొందిస్తున్నానని చెప్పుకొచ్చారు. కొత్త తరహా రాజకీయాలు, ప్రజల కోసం మంచి చేసే రాజకీయాలు ఎలా ఉంటాయో చూపిస్తామని కవిత పేర్కొన్నారు.

## కాళేశ్వరం మోటర్లను ? దెబ్బతీసే కుట్రలు

మొదటిపేజీ తరువాయి
గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెపం నెట్టేందుకే ఉద్దేశపూర్వకంగా మోటార్లను పాడు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ పాలనాపరమైన నిర్లక్ష్యమా లేక కావాలనే చేస్తున్న కుట్రనా అని నిలదీశారు. భారీ మోటార్లు నిరంతరాయంగా నడిచేలా డిజైన్ చేసినవి, పదే పదే ఆపితే తీవ్ర నష్టం తప్పదని హరీశ్‌రావు హెచ్చరించారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులను ఇలా నిర్లక్ష్యంగా వాడటం శోచనీయమని మండిపడ్డారు. చందలాపూర్ సహా ప్యాకేజీ 6, 8, 10, 11, 12 లలో మోటార్ల ఆపరేషన్ తీరు తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. తక్షణమే మోటార్లను పదే పదే ఆన్, ఆఫ్ చేసే అశాస్త్రీయ విధానాన్ని ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ నిబంధనల ప్రకారం, డిజైన్ కు అనుగుణంగా నిరంతరాయంగా పంపులు నడిపించాలని తెలిపారు. మీ రాజకీయాల కోసం తెలంగాణ రైతుల జీవనాడి అయిన ప్రాజెక్టులతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు.

## జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ

మొదటిపేజీ తరువాయి
కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై ఇప్పటికే కోర్టు వాదనలు విన్నది. బుధవారం తీర్పు వెలువరించాల్సి ఉండగా.. తీర్పును వాయిదా వేసింది. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వం 2024 మార్చి 14న జీవో 6ను జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్, ఐఏఎస్ మాజీ అధికారి ఎస్.కె.జోషిలు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెల్లుబాటుపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. అయితే, ఈ వ్యవహారంపై తీర్పును ధర్మాసనం ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది. కాళేశ్వరం అవకతవకలపై విచారణ కోసం 2024 మార్చి 14వ తేదీన ప్రభుత్వం జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. ఈ జీవోను సవాల్ చేస్తూ రాష్ట్రంలోని పలువురు కీలక నేతలు, అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చేపట్టిన విచారణ ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని పిటిషనర్లు పేర్కొన్నారు. తమపై అభియోగాలు మోపే ముందు, తమ వాదనలను కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా విచారణ సాగుతోందని వారు కోర్టుకు విన్నవించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలను వెలికితీసేందుకే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కమిషన్ తన నివేదికను అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగానే సిద్ధం చేసిందని కోర్టుకు తెలిపింది. విచారణలో భాగంగా పిటిషనర్లందరికీ నోటీసులు ఇచ్చి, నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్తున్నామని, కాబట్టి ఈ పిటిషన్లను కొట్టివేయాలని ప్రభుత్వం కోరింది. చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని బెంచ్ ఇరుపక్షాల వాదనలను సుదీర్ఘంగా విన్న తర్వాత, నేడు వెలువరించాల్సిన తీర్పును ఈ నెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

## 2- బిహెచ్ కె కాలనీల్లో దుకాణాల విక్రయాలు
## అందుబాటులో 36 కాలనీల్లోని 1400 కు పైగా షాపులు

**- వచ్చే ఆదాయం ఆయా కాలనీల అభివృద్ధికే వినియోగం**

హైదరాబాద్ పరిసరాల్లోని క్యూర్ పరిధిలోని డబుల్ బెడ్ రూం కాలనీల్లోని 1400 కు పైగా దుకాణాలను బహిరంగ వేల ద్వారా విక్రయించే పక్రియ ఏప్రిల్ 9 వ తేదీగురువారం నుంచి ప్రారంభం కానున్నది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని 36 కాలనీల్లో ఉన్న దుకాణాలను వేలం ద్వారా విక్రయించడానికి ఆయా జిల్లా కలెక్టర్లు నోటిఫికేషన్లు కూడా ఇచ్చారు. ఈ పక్రియలో భాగంగా తొలుత రంగారెడ్డి జిల్లా పరిధిలోని 8 కాలనీల్లోని 273 షాపులకు ఈ నెల 9,10 తేదీల్లో వేలం పక్రియను నిర్వహించనున్నారు. వందలాది కుటుంబాలు నివసించే కాలనీల్లో, స్థానికుల అవసరాలకు అనుగుణంగా వ్యాపారకార్యక్రమాలు నిర్వహించుకునేలా 60-400 చదరపు అడుగుల విస్తీర్ణంలో పలు దుకాణాలను నిర్మించారు. వీటిని ఉన్నవి ఉన్నట్లుగా అన్న ప్రాతిపదికన విక్రయిస్తున్నట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ శ్రీ వి.పి.గౌతం తెలిపారు. వీటికి కనీస ధరలను కూడా బహిరంగ మార్కెట్ కంటే తక్కువగా నామమాత్రంగానే నిర్ధారించారు. ఆసక్తి ఉన్న వారు ఆయా కాలనీలను సందర్శించి, తమకు నచ్చిన, అనువైన దుకాణాలను ఎంపిక చేసుకోవచ్చన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు నిర్ణీత మొత్తం ధరావతు (ఇంఎండి) తో వేలం నిర్వహించే తేదీల్లో ఉదయం గం.11.00 లోగా సంబంధిత ఆర్డీవో కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవచ్చని ఆయన వివరించారు.

పేదల వర్గాల ప్రజల కోసం మంచి వసతులతో, ఆహ్లాదకరమైన పరిసరాలతో అన్ని సదుపాయాలను కల్పిస్తూ ప్రభుత్వం డబుల్ బెడ్ ఇండ్ల కాలనీలను నిర్మిస్తున్నది. ఈ కాలనీల నిర్వహణ నిమిత్తం, ఈ దుకాణాల వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని వినియోగించనున్నారు.

## యధాతథంగా కీలక వడ్డీరేట్లు

**- ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా**

కీలక వడ్డీ రేట్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరుసగా రెండోసారి కూడా యధాతథంగా ఉంచింది. ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తాజాగా వెల్లడించారు. ఈసారి కూడా రెపో రెటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నామని ప్రకటించారు. దేశ ఆర్థిక వృద్ధిపై ఆశావహ అంచనాలు వెల్లడించిన ఆర్బీఐ గవర్నర్, అంతర్జాతీయ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్బీఐ రెపో రేట్లను ఆర్బీఐ యధాతథంగా ఉంచడం వరుసగా ఇది రెండోసారి. గత ఫిబ్రవరిలో జరిగిన సమీక్షలో కూడా వడ్డీ రేట్లలో ఆర్బీఐ ఎలాంటి మార్పులూ చేయలేదు. కాగా, అంతర్జాతీయ పరిస్థితులపై ఆర్బీఐ గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పలు సవాళ్లు ఎదురవుతున్నాయని, వృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.9 శాతంగా నమోదు కావొచ్చని అంచనా వేశారు

ప్రపంచవ్యాప్తంగా చమురు ధరల్లో పెరుగుదల ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపించవచ్చని ఆర్బీఐ గవర్నర్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం 4.6 శాతంగా ఉండొచ్చన్నారు. అలాగే ఏప్రిల్ 3వ తేదీ నాటికి భారత ఫారెక్స్ నిల్వలు 696.1 బిలియన్ డాలర్లు అని పేర్కొన్నారు. మరోవైపు దేశీయ వినియోగం బలంగా ఉందని, పెట్టుబడులు పెరుగుతున్నాయని తెలిపారు.

## పటిష్టంగా రహదారుల నిర్మాణం అధికారులకు చంద్రబాబు దిశా నిర్దేశం

రాష్ట్రంలో ఉన్న 45 వేల కిలోమీటర్ల పైచిలుకు రహదారుల నిర్వహణ పటిష్ఠంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. వివిధ ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి దాని ఆధారంగా రహదారుల నిర్మాణం జరగాలని సూచించారు. రహదారులు, భవనాలు, రవాణాశాఖపై సచివాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులు, అధికారులతో సీఎం చర్చించారు. ప్రధానంగా రాష్ట్రంలో రహదారుల నిర్వహణ, పాత్ హోల్ ఫ్రీ రహదారులు, ఈవీ బస్సుల వినియోగంపై సమీక్షలో చర్చించారు. ఈ సమీక్షకు మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. మెరుగైన రహదారుల ద్వారా ప్రజలకు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావాలని పేర్కొన్నారు. అతి తక్కువ వ్యయానికే ప్రజా రవాణా జరిగేలా ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇదిలావుంటే ఇటీవల తరచూ ప్రమాదాలకు గురవుతూ... ప్రజల ప్రాణాలను బలిగొంటున్న స్లీపర్ బస్సులను అవసరమైతే భవిష్యత్తులో రద్దుచేస్తామని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే దీనిపై కేంద్రాన్ని సంప్రదించామని పేర్కొన్నారు. 'ప్రయాణించే రెండు ప్రాంతాల మధ్య దూరాన్ని లెక్కించి బస్సు గమ్యస్థానం చేరాల్సిన సమయాన్ని నిర్దేశిస్తార. అంతకంటే ముందే వెళ్తే బస్సును సిటీలోకి అనుమతించబోం. 300 కి.మీ., అంతకంటే ఎక్కువ దూరం ప్రయాణించే ప్రైవేటు బస్సుల్లో ఇద్దరు డ్రైవర్లు ఉండాల్సిందే. రాత్రిపూట డ్రైవర్ నిద్రపోయేందుకు ఒక సీటు కేటాయించాలి. ఈ విషయాలను ప్రైవేటు బస్సు యాజమాన్యాలకు స్పష్టం చేశాం' అని మంత్రి వెల్లడించారు. బస్సు ప్రమాదాల నియంత్రణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం సచివాలయంలో సమీక్షించింది. రహదారుల వెంబడి స్పీడ్ గన్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.40 కోట్లు మంజూరుచేసింది.

## గిరిజన ప్రాంత సమస్యలపై మానవతా దృక్పథంతో పనిచేయండి

మొదటిపేజీ తరువాయి
కంపెనీల ప్రతినిధులు ఆయనతో సమన్వయం చేసుకొని తమకు ఆసక్తి ఉన్న విద్యా, వైద్యం, జల వనరులు, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ ఇలా దేనికైనా సీఎస్ఆర్ నిధులు వినియోగించవచ్చని సీఎం తెలిపారు. ఇప్పటికే రహేజా గ్రూప్ రూ.50 కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10 కోట్లు విద్యాభివృద్ధికి కేటాయించేందుకు ముందుకు వచ్చాయని.. వారికి సీఎం అభినందనలు తెలిపారు. కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ సీఎస్ఆర్ నిధుల విషయంలో ఇప్పటి వరకు ఇలా ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యా, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు వారు ఆసక్తి చూపారు.. సమావేశంలో రహేజా ఫౌండేషన్ నుంచి శ్రావణ్ కుమార్, రాంకీ ఫౌండేషన్ నుంచి దాక్షయణి ఆళ్ల, యశోద ఆసుపత్రి నుంచి డాక్టర్ గోరుకంటి సురేందర్ రావు, గోరుకంటి ఫల్గుణ్ రావు, మేఘా నుంచి సుధా రెడ్డి, అపోలో ఆసుపత్రి నుంచి అపర్ణా రెడ్డి, కామినేని భాస్కర్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి శేఖర్ రెడ్డి, పగిడిపాటి దేవయ్య, రుద్రమదేవి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

## నాదర్‌గుల్ భూముల్లో వాటా రానందుకే హరీశ్‌రావు దుష్ప్రచారం: మంత్రి పొంగులేటి

మొదటిపేజీ తరువాయి
సర్వే నంబర్ 613లోని భూములను 2014లో మూడు సంస్థలకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసిందని తెలిపారు. భూముల మ్యుటేషన్ జరిగిన 2016లోనూ వారి ప్రభుత్వమే ఉందన్నారు. 2014, 2016లో జరిగిన రిజిస్ట్రేషన్లతో ఈ ప్రభుత్వానికి ఏం సంబంధమని ప్రశ్నించారు."హరీశ్ రావు చెబుతున్న భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభించారు. భూములు పొందిన వారు నాలా కన్వర్షన్ ఇవ్వట్లేదని 2022లోనే సుప్రీంకోర్టుకు వెళ్లారు. వాళ్లు కోర్టుకు వెళ్తే బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. అవి ప్రభుత్వ భూములు అని చెప్పి మేం కౌంటర్ వేశాం. ఆనాడు వాటాల ఒప్పందం చేసుకుని భూములు కట్టబెట్టి ఇవాళ మా మీద నిందలు వేస్తున్నారు. నాదర్ గుల్ భూముల్లో వాటా రాకపోవడంతో హరీశ్ రావు ఇవాళ తెరపైకి తెచ్చారు. ప్రొహిబిటెడ్ భూముల్లో ఈ ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయలేదు. హరీశ్ రావు చెబుతున్న కంపెనీల్లో నా కుటుంబ సభ్యులెవరూ లేరు. నా కుటుంబ సభ్యులు ఉన్నారని నిరూపించాలని సవాల్ చేస్తున్నా. వట్టి నాగులపల్లి భూముల్లోనూ హరీశ్ రావు పూర్తిగా దుష్ప్రచారం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివాదాన్ని కూడా ఈ ప్రభుత్వానికి అంటగట్టారు" అని మంత్రి పొంగులేటి తెలిపారు.

## కాలుష్య కాసారంగా బంజారా లేక్

మొదటిపేజీ తరువాయి
తాజ్ బంజారా ముందున్న చెరువు తీవ్ర కాలుష్యంతో దుర్గంధభరితంగా మారిందంటూ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన కమిషనర్ రంగనాథ్ బుధవారం ఎమ్మెల్యే దానం నాగేందర్ తో కలిసి బంజారా లేక్ ను పరిశీలించారు. చెరువులోకి మురుగు నీరు, ఎ÷-లాస్టిక్ వ్యర్థాలు చేరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు రంగనాథ్. ఒకప్పుడు మంచినీటి సరస్సుగా బంజారా లేక్ ఇప్పుడు అత్యంత కలుషిత జలవనరుగా మారిందని అన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో రహదారి నిర్మాణం, చెరువు ఉనికికే ముప్పు తెచ్చిందని అన్నారు. కట్టమైసమ్మ ఆలయానికి వెళ్లే మార్గం ఆక్రమణపై భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని.. ప్రభుత్వ భూమిని కాపాడుతూ చెరువు పునరుద్ధరణకు సమగ్ర నివేదిక సిద్ధం చేస్తామన్నారు కమిషనర్ రంగనాథ్. నివాసాలను ప్రభావితం చేయకుండా చెరువు రక్షణ చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. నాలాలు మూసివేసే నిర్మాణాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు రంగనాథ్. అనంతరం శంషాబాద్ లోని మామిడిపల్లిలో నాలుగైదు చెరువులు మాయమయ్యాయన్న ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు రంగనాథ్. ఒంగోని కుంట, కనకయ్య కుంట, మద్రివాణి కుంట, ఎర్రకుంట ఆక్రమణలపై సీరియస్ అయ్యారు రంగనాథ్. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల నుంచి పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు. వరద కాలువలు ఆక్రమణలతో మూసివేతకు గురై వర్షాకాలంలో నీటిమునిగే ప్రమాదం ఉందని..ఆక్రమణదారులతో సమావేశమయ్యి స్వచ్ఛందంగా తొలగించకపోతే హైడ్రా చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువులు, కాలువలపై పూర్తి స్థాయి డేటా సేకరణకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు రంగనాథ్.

## శాట్ డీడీ అశోక్ కుమార్ కు అభినందన



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 8**
పిన్న వయసులో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన గుగులోతు అశోక్ కుమార్ ను పలువురు సన్మానించారు. గతంలో జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి పనిచేసిన అశోక్ కుమార్ కు ఇటీవల డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి లభించింది. కరీంనగర్ కు విచ్చేసిన అశోక్ కుమార్ కు జిల్లా క్రీడలు యువజన అధికారి శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ యోగ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డిలు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కృషి, పట్టుదల, అంకితభావంతో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని అశోక్ కుమార్ నిరూపించారని కొనియాడారు. యువ వయసులోనే ఈ స్థాయికి చేరుకోవడం ఎంతో గర్వకారణమని, క్రీడా రంగంలో ఆయన నాయకత్వం మరింత అభివృద్ధికి దోహదపడుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. యువత తమ లక్ష్యాల కోసం కష్టపడి ముందుకు సాగాలని ఈ సందర్భంగా అశోక్ కుమార్ తెలిపారు. కోచ్‌లు వి కిష్టయ్య, పవన్ కుమార్ లు శుభాకాంక్షలు తెలియజేశారు.

## డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టుతూ, సైబర్ నేరాల పై అవగాహన పెంచాలి

- **ముల్కనూర్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్;**



**కరపత్రం ప్రతినిధి భీమదేవరపల్లి**
డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రం లోని ముల్కనూరు పోలీస్ స్టేషన్ ను ఆయన బుధవారం సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, ఇబ్బంది పనితీరుతోపాటు రికార్డులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. గ్రామాల హిస్టరీ సీట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల పర్యటన తరచూ చేస్తూ వివరాలు సేకరించాలన్నారు. సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, కాజీపేట ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్ ఎస్ఐ రాజు ,సిబ్బంది ఆయన వెంట ఉన్నారు

## డంప్ యార్డ్ సమస్యపై కలెక్టర్‌తో చర్చించిన వొడితల ప్రణవ్

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 8**
హుజూరాబాద్ పట్టణ శివారులోని సిర్సాపల్లి ప్రాంతంలో ప్రతిపాదిత వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు సంబంధించి కొనసాగుతున్న వివాదంపై కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మేరకు కలెక్టరేట్ కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి సమస్య



తీవ్రతను వివరించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ వల్ల పరిసర ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని, ముఖ్యంగా రైతులకు మరియు వ్యవసాయ భూములకు తీవ్రమైన నష్టం కలగవచ్చని పేర్కొన్నారు. పంటలపై ప్రభావం, భూగర్భ జలాల కాలుష్యం, ప్రజల ఆరోగ్యంపై పడే దుష్ప్రభావాలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసిన ప్రణవ్, ఈ ప్రాజెక్ట్‌ను సిర్సాపల్లి నుంచి తరలించే అంశంపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఈ సమస్యపై సంబంధిత మంత్రులను, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులను పలుమార్లు కలిసి పూర్తి వివరాలు అందజేశామని తెలిపారు. మరోసారి సంబంధిత అధికారులతో సమగ్ర చర్చ జరిపి ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. ఈ విషయంపై కలెక్టర్ చిత్రా మిశ్రా సానుకూలంగా స్పందిస్తూ, సమస్యపై పూర్తి నివేదిక తీసుకుని పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు ప్రణవ్ తెలిపారు.

## వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌పై దుండగుల రాళ్లదాడి

**గస్తీ పోలీసులు రావడంతో ముఠా పరార్**
**ముఠాలో పోలీసులకు చిక్కిన ఇద్దరు మహిళలు**

ఒడిశా, బిహార్ రాష్ట్రాల తరహాలో తెలంగాణలోనూ రైలుపై దాడి జరగడం కలకలం రేపింది. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ లక్ష్యంగా దుండగులు రాళ్లతో దాడికి తెగబడ్డారు. గస్తీలో ఉన్న పోలీసులు అప్రమత్తమవ్వడంతో దుండుగులు పారిపోయారు. ఈ క్రమంలో వారిని పట్టుకునేందుకు సినీఫక్కీలో పోలీసులు చేజింగ్ చేశారు. కానీ 30 మంది గ్యాంగ్ తప్పించుకుని వెళ్లింది. అయితే గ్యాంగ్‌లోని ఇద్దరు మహిళలు మాత్రం పట్టుబడ్డారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతి బయల్దేరిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ గతరాత్రి తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్ దాటుతున్న సమయంలో ట్రాక్ పక్కన 30 మంది గ్యాంగ్ మాటు వేసి ఒక్కసారిగా రాళ్ల వర్షం కురిపించింది. కిటికీలు, బోగీలకు రాళ్లు తగలడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. సరిగ్గా అదే సమయంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు ఆ గుంపును గమనించి అడ్డుకునే ప్రయత్నం చేశారు. గ్యాంగ్‌ను పట్టుకునేందుకు పోలీసులు యత్నించగా.. సుమారు 30 మంది గుంపు పోలీసులనే రౌండప్ చేసి దాడికి యత్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అదనపు బలగాల సాయం కోరారు. దీంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ క్రమంలో వారిని కిలోమీటర్ల మేర ఛేజ్ చేశారు. కానీ నందిగామ మండలంలోని పాత జాతీయ రహదారి పక్కనే ఉన్న ఎన్‌సీఎల్ వెంచర్ గుండా పరుగులు తీసి చీకట్లో తప్పించుకున్నారు. కానీ ఇద్దరు మహిళలు మాత్రం పోలీసులకు చిక్కారు. వారిని బిహార్, ఒడిశా, రాజస్థాన్‌కు చెందిన ముఠాలుగా పోలీసులు అనుమానిస్తున్నారు. అరెస్టయిన ఆ ఇద్దరు మహిళలను విచారించగా, తాము రుద్రాక్ష మాలలు అమ్ముకోవడానికి వచ్చామని చెబుతున్నారు. అయితే, అర్ధరాత్రి వేళ రైలుపై దాడికి గల కారణాలపై వారు సరైన వివరణ ఇవ్వడం లేదని, వారి వేషధారణ, ప్రవర్తనపై పోలీసులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వీరంతా పక్కా ప్రణాళికతోనే రైళ్లను లక్ష్యంగా చేసుకున్నారా? అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. పరారైన ఆ 30 మంది గుంపు కోసం పోలీసులు రాత్రంతా వెంచర్లలో గాలింపు చర్యలు చేపట్టారు. రాజస్థానీ వేషధారణలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నందిగామ, తిమ్మాపూర్ పరిసర గ్రామాల్లోని ప్రజలు అపరిచితులకు ఆశ్రయం ఇవ్వకూడదన్నారు

# హుజురాబాద్‌లో విద్యుత్ కార్మికుల సమ్మె ఉధృతం...

- **డిమాండ్లు నెరవేర్చకపోతే పోరాటం మరింత తీవ్రం**

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 8**
తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ పిలుపు మేరకు ఈరోజు (08-04-2026) రాష్ట్రవ్యాప్తంగా అన్ని డివిజన్ కార్యాలయాల ఎదుట సమ్మెలు ఉధృతంగా కొనసాగాయి. ఈ క్రమంలో హుజురాబాద్ డివిజన్ కార్యాలయం ముందు నిర్వహించిన సమ్మెకు భారీగా కార్మికులు తరలివచ్చి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కార్యాలయం ముందు నినాదాలతో మార్మోగిస్తూ, తమ హక్కుల కోసం పోరాటానికి సిద్ధమని స్పష్టం చేశారు.
ఈ సమ్మెలో ఆర్టిసన్ కార్మికులు, అనుమ్యాన్ కార్మికులు, ఎస్‌పిఎం వర్కర్లు, పిసురేటు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకొని, నినాదాలు చేస్తూ, తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. “మాకు న్యాయం చేయాలి”, “ఒకే సంస్థలో ఒకే రూల్స్ ఉండాలి”, “కార్మికుల హక్కులను కాపాడాలి” వంటి నినాదాలు మారుమోగాయి.
**కార్మికుల ప్రధాన డిమాండ్లు:**
ఆర్టిసన్ కార్మికులకు ఏపీఎస్ఈబీ నిబంధనలు పూర్తిగా వర్తింపజేయాలి.
అనుమ్యాన్ కార్మికులను ఆర్టిసన్‌గా గుర్తించి సమాన



హక్కులు కల్పించాలి.
పిసురేటు కార్మికులకు జి.ఓ. 11 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలి. విధుల్లో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ, “మేము గత 15 నుండి 20 సంవత్సరాలుగా ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్నాం. అయినప్పటికీ మా సేవలకు తగిన గుర్తింపు లేదు. విద్యుత్ పనులు ప్రమాదకరమైనవి, ప్రతీ రోజూ ప్రాణాలతో ఆటలాడుతూ పనిచేస్తున్నాం. ఇప్పటికే అనేక మంది సహచరులు విద్యుత్ షాక్‌లకు గురై ప్రాణాలు కోల్పోయారు. అయినా వారి కుటుంబాలకు సరైన సహాయం అందడం లేదు” అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టిసన్ కార్మికులు పంజాల శ్రీనివాస్, ఉప్పల్ రవి, అలాగే అనుమ్యాన్ కార్మికులు వెంకటేష్, శివ, రవి, శ్రవణ్, రాజు, శ్రీను తదితరులు మాట్లాడుతూ, “ఉద్యోగ భద్రత లేకుండా, తక్కువ




వేతనాలతో, ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయాల్సి వస్తోంది. మాకు కనీస హక్కులు కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం తగదు” అని మండిపడ్డారు. కార్మికులు హెచ్చరిస్తూ, “ప్రభుత్వం వెంటనే స్పందించి మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే, భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం. అవసరమైతే సమ్మెను మరింత ఉధృతం చేస్తాం” అని స్పష్టం చేశారు. ఈ సమ్మెలో హుజురాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని సెక్షన్లకు చెందిన ఆర్టిసన్, అనుమ్యాన్, ఎస్‌పిఎం, పిసురేటు కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటుకున్నారు. కార్మికుల సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కూడా కోరుతున్నారు. కార్మికుల ఐక్యత -- ప్రభుత్వానికి హెచ్చరిక ఈ సమ్మె ద్వారా కార్మికులు తమ ఐక్యతను చాటుతూ, న్యాయం కోసం చివరి వరకు పోరాడతామని మరోసారి స్పష్టం చేశారు

## కుటుంబానికి...సమాజానికి చేసినవే జ్ఞాపకాలుగా మిగిలిపోతయ్...

- **పిక్కల పెద్ద రాజయ్య సేవలు చిరస్మరణీయం**
- **మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

**కరపత్రం ప్రతినిధి మంథని ఏప్రిల్ 8**
మనిషి పుట్టడం, గిట్టడం సర్వసాధారణమేనని, అయితే ఉన్నన్ని రోజుల్లో కుటుంబానికి, సమాజానికి చేసిన సేవలే జ్ఞాపకాలుగా మిగిలిపోతాయని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంథని మండలం చిల్లపల్లి గ్రామంలో మాజీ ఎంపీటీసీ పిక్కల పెద్ద రాజయ్య ప్రథమ వర్థంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, రాజయ్య కుటుంబసభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో బంధుత్వాలు, ప్రేమ అనురాగాలు కరువవుతున్న తరుణంలో తండ్రి జ్ఞాపకాలను నిలిపేలా రాజయ్య కుటుంబం విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గర్వించదగిన విషయమన్నారు. ఆనాడు రాజయ్య కుటుంబానికి, సమాజానికి, గ్రామానికి చూపిన ప్రేమానురాగాలే ఈరోజు జ్ఞాపకాలు నిలిచిపోయాయని, ఆయన ఈనాడు మన మధ్యలో లేకపోయినా గుర్తు చేసుకోవడమే రాజయ్య గొప్ప వ్యక్తి అని అర్థం అవుతోందన్నారు. సమాజంలో ఇలాంటి పరిస్థితి అందరికి రాదని, కొందరు మాత్రమే గొప్పగా కుటుంబాన్ని, సమాజాన్ని గౌరవిస్తారని, అలాంటి వారి జ్ఞాపకాలనే స్మరించుకుంటామని, అందులో పిక్కల పెద్ద రాజయ్య ఒక వ్యక్తి అని ఆయన అభివర్ణించారు.





రాజయ్య కుటుంబం సైతం ఆయన సేవలను గుర్తుండేలా విగ్రహం ఏర్పాటు చేసి గౌరవించుకోవడం అభినందనీయమన్నారు.

**జన్మనిచ్చిన వారిని స్మరించుకోవాలే...పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యే మంథని**

జన్మనిచ్చిన వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంథని మండలం చిల్లపల్లి మట్టిబిడ్డ సిరిపురం మాజీ ఎంపీటీసీ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిక్కల పెద్ద రాజయ్య ప్రథమ వర్థంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టడం, చనిపోవడం సహజమే అయినప్పటికి జన్మనిచ్చిన వారి రుణం తీర్చుకునేలా వారి జ్ఞాపకాలను స్మరించుకోవడం అభినందనీయమన్నారు. నేటి సమాజంలో ప్రేమలు, ఆప్యాయతలు, బంధుత్వాలు క్షీణించిపోతున్న క్రమంలో తండ్రిని ఇంత గొప్పగా పూజించుకోవడం అభినందనీయమన్నారు. పిక్కల పెద్ద రాజయ్య తన కుటుంబంతో పాటు సమాజాన్ని ప్రేమించిన గొప్ప వ్యక్తి అని, సుమారు 15ఏండ్ల పాటు తనతో పాటు కలిసి నడిచాడని, గ్రామం, కుటుంబం కోసం ఎంతో తపించేవాడని గుర్తు చేశారు. తల్లిదండ్రులను కన్నవారు చూసుకోవడం లేదని ఈనాడు సోషల్‌మీడియాలో అనేక కథనాలు చూస్తున్నామని, ఈ తరుణంలో పెద్ద రాజయ్య మన మధ్యలో లేకపోయినా ఆయన జ్ఞాపకాలను నెమరవేసుకునేలా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని, పెద్ద రాజయ్య కొడుకుల్లో తాను ఒకడిగా రాజయ్య ఆశయ సాధన కోసం పని చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను వంచిస్తోంది: దళిత బంధు సాధన నేతల ఆగ్రహం

- **132 కుటుంబాలకు దళిత బంధు నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్**

**కరపత్రం ప్రతినిధి మంథని, ఏప్రిల్ 8:**
ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, దళితులను బీసీలను మైనారిటీ వర్గాలను వంచిస్తోందని దళిత బంధు సాధన సమితి నాయకులు తీవ్రంగా విమర్శించారు. మంథని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత బంధు రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు గద్దల శంకర్, మంథని డివిజన్ దళిత బంధు సాధన సమితి అధ్యక్షులు ఊట్ల శ్రీను మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రకటించిన ‘అంబేద్కర్ అభయహస్తం’ పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.




అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సంవత్సరాల కాలం గడిచినా ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని ఆరోపించారు. మంథని నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే అర్హులైన 132 కుటుంబాలకు దళిత బంధు నిధులు మంజూరైనా, వాటిని విడుదల చేయకుండా నిలిపివేశారని నేతలు ఆరోపించారు. కలెక్టర్ ఖాతాలో పడిన నిధులను కూడా విడుదల చేయకుండా ఆలస్యం చేస్తున్నారని తక్షణమే ఆ నిధులను విడుదల చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో దళితులకు అండగా ఉంటామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించడం సరికాదని నేతలు హెచ్చరించారు. తక్షణమే దళిత బంధు, అభయహస్తం పథకాల నిధులను విడుదల చేసి, అర్హులైన కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.
దళితులను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగిస్తున్నారని ఆరోపిస్తూ, సమస్యను వెంటనే పరిష్కరించకపోతే గ్రామ గ్రామాన ప్రజలను చైతన్య పరచి ప్రభుత్వంపై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నేతలు హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మంతెన లక్ష్మణ్, మంథని డివిజన్ దళిత సంఘం సీనియర్ నాయకులు,అవునూరి రాజలింగం కమాన్‌పూర్ మండల దళిత బంధు సాధన సమితి అధ్యక్షులు, మంత్రి రాజబాబు రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి తోటపల్లి రాజబాబు, దళిత బంధు మంథని డివిజన్ నాయకులు జూల రమేష్, మేకల వెంకటస్వామి, గువ్వల రాజు, జనగామ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

### - ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 08:**
రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి బుధవారం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవనాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన మరియు అత్యాధునిక వైద్య సేవలు



అందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ఈ క్రిటికల్ కేర్ ఆసుపత్రి నిర్మాణం ఒక ముఖ్యమైన అడుగు అని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడంలో క్రిటికల్ కేర్ సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయని, గోదావరిఖని, పరిసర ప్రాంత ప్రజలకు ఇప్పటివరకు ఎదురైన వైద్య సమస్యలకు ఈ ఆసుపత్రి సమర్థవంతమైన పరిష్కారంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులు, సిబ్బంది ద్వారా రోగులకు వేగవంతమైన మరియు మెరుగైన చికిత్స అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# అర్ధరాత్రి అక్రమంగా కూల్చివేతలకు అడ్డాగా రామగుండం...

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తే ప్రజలు తిరగబడతారు...
- ప్రజలకు అండగా బిఆర్ఎస్ నిలుస్తుంది..
- గుర్తుతెలియని వ్యక్తులచే కూల్చివేతలు చేస్తే తరిమికొట్టండి..
- చోద్యం చూస్తున్న పోలీసులు, అధికారులు తగిన మూల్యం చెల్లించుకుంటారు..
- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హరీష్ రెడ్డి



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 08:** గత రెండు రోజుల క్రితం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో సామాన్య కుటుంబం జీవనోపాధికై తమ దగ్గర ఉన్న ఆస్తిపాస్తులు అమ్ముకొని వ్యాపారం చేసుకుంటుంటే అక్రమ కట్టడాలని మున్సిపల్ అధికారులు సింగరేణి స్థలమని సింగరేణి అధికారులు చలో కూల్చేయండి నేను చూసుకుంటా అని ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ అర్ధరాత్రి దొంగల్లా పోలీసులను అడ్డుపెట్టుకొని కూల్చివేతలు చేస్తే.. సహించేది లేదని, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతున్నాం న్యాయస్థానంలోనే తేల్చుకుంటామని ఎదురు నిలిచిన అభాగ్యురాలు కుటుంబానికి మేమున్నామని అండగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హరీష్ రెడ్డి బుధవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నెంబర్ ప్లేట్లు లేని బుల్డోజర్ వ్యవస్థతో రేవంత్ రెడ్డి పేదల ఇండ్లు కూలుస్తున్నారని రామగుండంలో రాజ్ ఠాకూర్ అక్రమ చట్టం పేరుతో పోలీసులను అడ్డుపెట్టుకొని అర్ధరాత్రి దొంగల్లా నెంబర్ ప్లేట్లు లేని జెసిబిలతో పేద మధ్యతరగతి చిరు వ్యాపారులను రోడ్డున పడేస్తూ.. వారి సముదాయాలను కూల్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యానికి విలువలు లేకుండా ఒకపక్క రామగుండం నగరం అభివృద్ధి అంటూ కూల్చివేతలకు శ్రీకారం చుట్టి వేలాది మందిని బజారున పడేశాడని, అన్ని విధాలుగా న్యాయ చట్టబద్ధంగా ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించుకున్న వ్యాపార సముదాయాన్ని కూల్చడానికి మీరు ఎవరని ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థను కూడా కించపరిచే విధంగా చేస్తున్న మీ చర్యలను ప్రజాక్షేత్రంలో మీరు చేస్తున్న అరాచకాలను ఎండా కడతామని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తులు నెంబర్ ప్లేట్ లేని జెసిబి వాహనాలతో ఎక్కడైనా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కూల్చివేతలకు దిగితే వారిని తరిమి కొట్టండి జెసిబిలను తగలబెట్టండి మీకు అండగా బిఆర్ఎస్ పార్టీ న్యాయబద్ధంగా పోరాడేందుకు నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలు ఇకనైనా అన్యాయాన్ని ఎదిరిస్తూ అక్రమాలను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పోలీసులు చట్టబద్ధంగా ప్రజలకు రక్షణ కల్పించాల్సింది పోయి గుర్తు తెలియని వ్యక్తులకు కాపలా కాయడమేంటని ప్రజా పౌరులుగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నడుచుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉందని అలాంటిది తమ కార్యకర్తలపై అమానుషంగా వ్యవహరిస్తూ చేయి చేసుకోవడం ఫోన్ లాక్కోవడం భారత న్యాయ శిక్షాస్మృతి ప్రకారం సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. నగరాన్ని అద్భుతంగా సుందరీకరిస్తాం వ్యాపార అభివృద్ధికి కృషి చేస్తామని ప్రగల్భాలు పలికే ఎమ్మెల్యే ఈ ప్రాంత వ్యాపారుల సముదాయాలు కూల్చి.. ఇతర ప్రదేశాలకు వెళ్లేలా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఒకపక్క ఈ ప్రాంతం తీవ్ర కాలుష్య కూరల్లో చిక్కుకుందని అందులో నుండి బయటపడేందుకు ఈ ప్రాంతంలో గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసి ప్రజలను రక్షించాల్సిన నాయకులు మరింత కాలుష్యం కోరల్లో చిక్కుకునేలా బొగ్గు ఆధారిత పరిశ్రమలు తీసుకువచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఎండగడతామని ప్రజలతో కలిసి కాలుష్య కోరల్లో చిక్కుకునే బొగ్గు ఆధారిత పరిశ్రమలు రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం కెసిఆర్ నాయకత్వంలో రాబోతుందని అప్పుడు కొంతమంది అరాచక పాలనకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హెచ్చరించారు. బాధితుల పక్షాన ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా ఉంటామని ప్రజలు కలిసి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యురాలు తస్నీమ్ భాను, బొబ్బిలి సతీష్ యువజన విభాగం అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ, అల్లీగణేష్, నడిపెల్లి సాయి, పోయిల రవి, కడమండ శ్రీహరి, కొండా సురేష్, జీనత్ తదితరులు పాల్గొన్నారు.

# నరేందర్ రెడ్డి నోరు జాగర్త... సిర్సాపల్లి ప్రజలు గొర్రెలు కాదు!

▪ వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్ట్‌పై ఘాటైన హెచ్చరిక



**కరపత్రం ప్రతినిధి, హుజురాబాద్:** సిర్సాపల్లి గ్రామంలో ప్రతిపాదిత "వేస్ట్ టు ఎనర్జీ" డంప్‌యార్డ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం రోజురోజుకు ఉధృతమవుతోంది. ఈ నేపథ్యంలో సూడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ప్రజా సంఘాల నాయకుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్ తీవ్రంగా స్పందించారు.
"నరేందర్ రెడ్డి నోరు జాగర్త... సిర్సాపల్లి ప్రజలు గొర్రెలు కాదు" అంటూ ఘాటుగా హెచ్చరించిన సమ్మయ్య, హుజురాబాద్ ప్రాంత ప్రజల ఆత్మగౌరవాన్ని తక్కువ చేసి మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు.హుజురాబాద్ ప్రాంతంలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, సబ్బండ వర్గాలు ఏకమై ఈ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ పోరాటాన్ని రాజకీయ రంగు పులుముతూ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నిరాహార దీక్షపై "చెత్త రాజకీయాలు" అంటూ వ్యాఖ్యానించడం అనవసరం మరియు దురుద్దేశపూర్వకమని మండిపడ్డారు."ఈ వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్ట్ అంత మంచిదే అయితే, సీఎం రేవంత్ రెడ్డి కాళ్లు మొక్కి కరీంనగర్‌లోనే ఏర్పాటు చేసుకోండి. సిర్సాపల్లిలో పెట్టి హుజురాబాద్ ప్రాంతాన్ని నాశనం చేయాలనుకోవడం ఎందుకు?" అంటూ సమ్మయ్య ప్రశ్నించారు.సిర్సాపల్లి, హుజురాబాద్ ప్రాంతం పోరాటాల గడ్డ అని, ఇక్కడి ప్రజలపై చులకనగా మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. నరేందర్ రెడ్డికి ఈ ప్రాజెక్ట్‌పై సరైన అవగాహన లేకుండానే ఛైర్మన్‌గా ఎలా ఉన్నాడో అర్థం కావడంలేదని విమర్శించారు. కనీసం "గూగుల్ తల్లి"ని సంప్రదించి ఈ ప్రాజెక్ట్ గురించి తెలుసుకోవాలని సూచించారు.ఇకపై హుజురాబాద్ డంప్‌యార్డ్ వ్యతిరేక పోరాటం, ప్రజల జీవించే హక్కుపై ఎవరైనా రాజకీయ నాయకుడు వ్యతిరేకంగా మాట్లాడితే, వారికి రాజకీయంగానే బుద్ధి చెబుతామని సమ్మయ్య గట్టిగా హెచ్చరించారు."ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తు కోసం ఈ పోరాటం... వెనక్కి తగ్గేది లేదు" అని కమిటీ స్పష్టం చేసింది.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 08:** రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రంక్‌డల అండ్ డ్రైవ్ లో పట్టుబడిన ముగ్గురిని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ గోదావరిఖని వెంకటేష్ దుర్వ ముందు హాజరుపరుచగా.. ఇద్దరికీ రూ.4 వేలు జరిమానా విధించారు. ఒక వ్యక్తి రెండవసారి పట్టుబడగా మూడు రోజుల జైలు శిక్ష విధించారు. వీరిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. సీఐ మాట్లాడుతూ వాహనం మద్యం తాగి వాహనం నడప రాదని నడిపినచో వారిపై చట్టరీత్యా చర్య తీసుకోవడం జరుగుతుందనీ, వాహనానికి సంబంధించిన పత్రములు, టూ వీలర్ వెహికల్స్ నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, రాంగ్ రూట్లో వెళ్లరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాన్ని అతివేగంగా నడపరాదని సిఐ సూచించారు.

# కీ.శే ముద్దసాని దామోదర్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయం

- రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు ఉమ్మడి జిల్లా మాజీ సీనియర్ టీడీపీ నేత పోలాడి రామారావు



**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్:** అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కరీంనగర్ జిల్లా కమలాపూర్ ఇప్పటి హుజురాబాద్ నియోజక వర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున వీణవంక మండలం మామిడాల పల్లి గ్రామానికి చెందిన ముద్దసాని దామోదర్ రెడ్డి పిన్న వయసులోనే 1985 నుంచి వరుసగా 4 సార్లు శాసన సభ్యుడిగా గెలుపొంది ఎన్టీఆర్. చంద్రబాబు నాయుడు కేబినెట్ లో యువజన సర్వీసులు. పర్యాటక శాఖ. గనులు. రవాణా శాఖా. సాంకేతిక విద్యా శాఖా మంత్రిగా పనిచేసి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధికి విశేష కృషి చేసిన దామోదర్ రెడ్డి ముఖ్యంగా రైతుల సామాన్యుల సమస్యల పరిష్కారానికి చేసిన సేవలు చిరస్మరణీయం అని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు కొనియాడారు. ఎస్ ఆర్ ఎస్ పి చివరి ఆయకట్టు వరకు రైతులకు నీళ్ళు అందేలా దామోదర్ రెడ్డి పర్యవేక్షణ చేసేవారని అన్నారు.హుజురాబాద్ కమలాపూర్ నియోజక వర్గాలలోని ఆర్ అండ్ ఆర్ కింద ప్రతి గ్రామానికి పక్కా బీటీ రోడ్లు నిర్మించారని మంచి నీటి ఓవర్ హెడ్ ట్యాంకులు ఓపెన్ వెల్ బావులు నిర్మించి ప్రతి గ్రామానికి మంచినీటి సమస్యలు లేకుండా కృషి చేశారని.స్కూల్ భవనాలు కమ్యూనిటీ భవనాలు సీసీ రోడ్లు నిర్మించారని చెరువుల పునరుద్ధరణకు పూడిక తీత పనులు చేపట్టి చెక్ డాంలు నిర్మించి భూగర్భ జలాలు పైకి 4ఉండే విధంగా రైతులకు ఎంతో కృషి చేశారని.బలహీన వర్గాలకు ప్రభుత్వం తో స్థలం కొనిపించి పట్టాలు ఇప్పించి సామూహిక ఇండ్ల కాలనీలు నిర్మించారని గ్రామాల్లో పెత్తందార్ల పాలిట సింహ స్వప్నం లా ఉండి అట్టడుగు వర్గాలకు అండగా నిలిచిన సామాజిక న్యాయవాది గా నిలిచారని యువతకు ఆశా జ్యోతి లా ఆదర్శంగా దామోదర్ రెడ్డి ఉండే వారని నన్ను సైతం ప్రజా బాహుళ్యానికి దగ్గరగా ఉండే విధంగా ప్రోత్సహించి నాయకుడుగా నన్ను తీర్చి దిద్దిన గొప్ప వ్యక్తిని ఆయన లేను లోటు తీర్చలేనిదని ఆయన ఆశయాలు ఆదర్శంగా తీసుకోవడమే ఆయనకు నిజమైన నివాళి అని పోలాడి రామారావు అన్నారు.బుధవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా ముద్దసాని దామోదర్ రెడ్డి అభిమానుల తో ఓ ప్రైవేట్ హోటల్ లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పోలాడి రామారావు మాట్లాడారు. 1956జూలై 20 న లో జన్మించిన దామోదర్ రెడ్డి 2012 ఏప్రిల్ 9 న మృతి చెందగా
గురువారం దామోదర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా అలుగునూరుకు సమీపంలోని సదాశివ పల్లి తీగల వంతెన హైవే రోడ్డులో ముద్ద సాని దామోదర్ రెడ్డి కాంస్య విగ్రహాన్ని మాన కొండూర్ ఎం ఎల్ ఏ డాక్టర్ కవ్వం పల్లి సత్యనారాయణ తో వారి కుటుంబ సభ్యులు ఆవిష్కరిస్తారని దీనికి కేంద్ర మంత్రి బండి సంజయ్ రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు దుద్దిల్ల శ్రీదర్ బాబు పొన్నం ప్రభాకర్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్. ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎం ఎల్ ఏ చింతకుంట విజయరామారావు కరీంనగర్ ఎం ఎల్ ఏ మాజీ మంత్రి గంగుల కమలాకర్.నగర మేయర్ శ్రీనివాస్ తదితర ముఖ్య అతిథులతో పాటు వేలాది మంది దామోదర్ రెడ్డి అభిమానులు హాజరు కానున్నట్లు తెలిపారు విగ్రహావిష్కరణ అనంతరం వర్ధంతి సందర్భంగా దామోదర్ రెడ్డి అభిమానులు నిర్వహించే సంతాప సమావేశం లో అధిక సంఖ్యలో పాల్గొనాలని రామారావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోపు గోపాల్ రెడ్డి. రాచమడుగు నరసింగారావు పుప్పాల రఘు. వెన్నమ నేని విక్రమ సింహ రావు మూల పుల్లా రెడ్డి కలకుంట్ల సత్యనారాయణ రావు చందా గాంధీ.గోలి రాజేశ్వర్ రావు. పోల్నేని సత్యనారాయణ రావు గంగాటి తిరుపతి రెడ్డి తణుకు ప్రభాకర్ లు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

- మున్సిపల్ చైర్మన్ ఓద్నాల శ్రీనివాస్



**కరపత్రం ప్రతినిధి మంథని, ఏప్రిల్ 8:** మంథని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడలు ఆడుకునే క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా మున్సిపల్ పరంగా చర్యలు తీసుకుంటామని మంథని మున్సిపల్ చైర్మన్ ఓద్నాల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మంథని జూనియర్ కళాశాల మైదానంలో మార్నింగ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ఓద్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, కౌన్సిలర్లు మాచిడి రాజు గౌడ్ ,ఎల్లంకి వంశీధర్, పోతరవేన శ్రీలత క్రాంతి లను వారు సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. కళాశాల మైదానంలో ప్రతిరోజు ఉదయం వాకర్స్ తో పాటు మార్నింగ్ క్రికెట్ ఆడుకునే వారితో గ్రౌండ్ సందడిగా మారుతుందన్నారు. క్రికెట్ క్రీడ కూడా శరీరానికి మంచి వ్యాయామం ఇస్తుందని ప్రతిరోజు క్రికెట్ ఆడేవారు సంతోషంగా ఉంటారని అన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి గ్రౌండ్ ను శుభ్ర పరచడంతో పాటు క్రికెట్ పిచ్ పైన వాటర్ కొట్టించి శుభ్రపరుస్తామని తెలిపారు. మార్నింగ్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగం వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో. ఉపాధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి ఆకుల అజయ్, సహాయ కార్యదర్శి డాక్టర్ రాజేంద్రప్రసాద్, కోశాధికారి రవికుమార్, కార్యవర్గ సభ్యులు కొండపర్తి నరేష్, సతీష్ కుమార్, రాజు తో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘంతో టిఎంసి సమావేశం రసాభాసగా ముసిని భేటీ

బెంగాల్‌లో బుధవారం తృణమూల్ కాంగ్రెస్ బృందం-ఎన్నికల సంఘం మధ్య జరిగిన సమావేశంలో రసాభాస నెలకొంది. ఏడు నిమిషాల పాటు జరిగిన సమావేశం అనంతరం ఇరు వర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. సమావేశం అనంతరం టీఎంసీ రాజ్యసభ ఎంపీ డెరెక్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాసిన లేఖను తాము ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు అందజేశామని పేర్కొన్నారు. అదేవిధంగా ఎన్నికల అధికారులకు భాజపాతో సంబంధాలున్న నిర్దిష్ట ఉదంతాలను ఆయన ముందు లేవనెత్తామన్నారు. దీంతో ఎన్నికల సంఘం అధిపతి ఆగ్రహంతో తమను సమావేశం నుంచి బయటకు వెళ్లిపొమ్మన్నారని ఆరోపించారు. మరోవైపు టీఎంసీ నేతల సమావేశంలో ఓ ఎంపీ అరుస్తూ గందరగోళం సృష్టించారని ఈసీ ఆరోపించింది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతున్న సమయంలో టీఎంసీ ఎంపీ ఇతర ఎన్నికల కమిషనర్లపై కేకలు వేస్తూ.. ఆయనను మాట్లాడకుండా అడ్డుకున్నారని తెలిపింది. బెంగాల్‌లో ఎటువంటి హింసాత్మక ఘటనలు, బెదిరింపులు, ప్రలోభాలు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది.
టీఎంసీ అధికారిక బృందంతో సమావేశం అనంతరం ఆ పార్టీకి ఎన్నికల సంఘం అల్టిమేటం జారీ చేసింది. ఎటువంటి హింసాత్మక ఘటనలు జరగకుండా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని సూచించింది. ఓటింగ్ సమయంలో బూత్ క్యాప్చరింగ్, బూత్ జామింగ్ వంటి ఓటర్లకు అంతరాయం కలిగించే చట్టవిరుద్ధమైన చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించింది.

# భవానీపూర్ లో మమత నామినేషన్ భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు

- నా జీవితం ఇక్కడే ప్రారంభం అయ్యిందని వెల్లడి

పశ్చిమబెంగాల్ లో అసెంబ్లీ ఎన్నికల హడావుడి నెలకొంది. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన సొంత నియోజకవర్గం భవానీపూర్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. తన జీవితంలో అంతా ఇక్కడినుంచే మొదలైందని ఈ సందర్భంగా ఆమె వ్యాఖ్యానించారు. నామినేషన్ వేయడానికి ముందు ఖాళీఘాట్‌లోని నివాసం నుంచి అలీపుర్ సర్వే భవనం వరకు ఆమె రోడ్‌షో నిర్వహించారు. ఈ క్రమంలో ఆమె మద్దతుదారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆమె ఇక్కడ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఆ తర్వాత ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 'నేను పుట్టింది,
పెరిగింది భవానీపుర్‌లోనే. నా జీవితంలో అంతా ఇక్కడినుంచే మొదలైంది' అని వ్యాఖ్యానించారు. మొత్తం 294 స్థానాల్లోనూ టీఎంసీ అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ఆమె ప్రజలను కోరారు. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లో భాగంగా.. పలువురి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడంపై మమత ఆందోళన వ్యక్తంచేశారు. 'ఓటర్ల జాబితా నుంచి అనేకమంది పేర్లను తొలగించడం నాకు చాలా బాధ కలిగిస్తోంది. ఓటరు తుది జాబితా ఇంకా ఎందుకు విడుదల చేయలేదో నాకు అర్థంకావడం లేదు. దీనికి వ్యతిరేకంగా మేం మళ్లీ కోర్టును ఆశ్రయిస్తాం' అని అన్నారు. భవానీపుర్ నుంచి మమత మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. దీదీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గం నుంచి భాజపా తన అభ్యర్థిగా సువేందు అధికారిని బరిలోకి దింపింది. ఇక, బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23, 29న రెండు విడతలుగా జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉండనుంది.

# వనపర్తిలో హరీష్ రావు సభకు అనుమతి రద్దు

- హైకోర్టుకు వెళతామన్నా మాజీమంత్రి నిరంజన్ రెడ్డి

కాంగ్రెస్ సర్కార్ ప్రజాపాలనలో అప్రజాస్వామిక విధానాలు కొనసాగుతున్నాయని బిఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. పరిగి రైతుల పరామర్శకు వెళ్లి బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలను అక్రమ అరెస్టు చేసిన సర్కార్.. వనపర్తిలో హరీశ్‌రావు బహిరంగ సభకు అనుమతులను రద్దు చేసింది. వనపర్తి నియోజకవర్గం రేవల్లి మండలంలో గొల్లపల్లి రిజర్వాయర్
నిర్మాణానికి వ్యతిరేకంగా గత 100 రోజులుగా రైతులు దీక్షలు చేస్తున్నారు. వారికి మద్దతుగా ఈ నెల 9వ తేదీన హరీశ్‌రావు బహిరంగ సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సమావేశానికి అనుమతి ఇవ్వాలని పోలీసులను కోరారు. ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు సభ కోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ అకస్మాత్తుగా గతంలో ఇచ్చిన అనుమతులను ప్రభుత్వం రద్దు చేసింది. హరీశ్‌రావు సభకు అనుమతులు రద్దు చేయడంపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టుకు వెళ్లి సభకు అనుమతులు తెచ్చుకుంటామని తెలిపారు. ప్రజలు, రైతాంగం తరపున ప్రశ్నిస్తున్న ప్రతిపక్షం గొంతు నొక్కేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమాలు కొత్త కాదని తెలిపారు. తాము కేసులు, బెదిరింపులకు భయపడితే ఈ తెలంగాణ వచ్చేది కాదని స్పష్టం చేశారు.